# వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- పది పరీక్షలకు సన్నద్ధం
- ప్రణాళికతో ఉపాధ్యాయులు ముందుకు
- విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన వారిపై దృష్టి



విద్యార్థులకు అభ్యాస దీపికలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

దస్తురాబాద్, డిసెంబర్ 9 : ప్రభుత్వ పాఠశాలల్లో పదిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. అర్థమయ్యేలా పాఠాలు బోధించడమే కాకుండా విద్యార్థుల్లో మనోబలాన్ని నింపుతున్నారు. ఈ నెల 9 నుంచి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. ఉత్తమ ఫలితాలను సాధించడానికి ఇప్పటికే విద్యార్థులకు అభ్యాస దీపిక పుస్తకాలను అందజేశారు. ఇప్పటికే దాదాపు 60 శాతం సిలబస్ పూర్తి కాగా డిసెంబర్ ఆఖరు వరకు వంద శాతం సిలబస్ పూర్తి అయ్యేలా ముందుకు సాగుతున్నారు.

**వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి..**

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నవంబర్ 8 నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. పదో తరగతి విద్యార్థులకు ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. రోజుకు ఒక సబ్జెక్ట్ ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులను తీసుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం మెరుగైన ఫలితాలను సాధించాలనే లక్ష్యంతో విద్యార్థులకు రోజు వారీ టెస్టులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సిలబస్‌ను సాధ్యమైనంత వరకు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. నెల వరకు ఈ ప్రత్యేక తరగతులు నిర్వహించి, మార్చిలో ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. మండలంలో రెండు జడ్పీ ఉన్నత పాఠశాలలు, రెండు బాలికల, బాలుర ఆశ్రమ పాఠశాలలు, ఒక కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. కడెం మండలంలోని అంబారిపేట గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను కలుపుకొని మొత్తం 169 మంది తెలుగు/ ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో 84 మంది బాలురు, 85 మంది బాలికలు పరీక్షలు రాయనున్నారు.

**చక్కగా పాఠాలు చెప్తున్నారు..**



సబ్జెక్ట్‌లలో వస్తున్న సందేహాలను ఎప్పటి కప్పుడు ప్రత్యేక తరగతుల్లో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుంటున్నాం. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తా. వెళ్తున్నాం. ఉదయం,సాయంత్రం ఆయా సబ్జెక్ట్‌ల ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. సబ్జెక్ట్‌పై అవగాహన పెరుగుతుంది. పరీక్షల్లో మంచి మార్కులను సాధించే ఆస్కారం ఉంది. సబ్జెక్ట్‌లో అర్థంకానివి, కఠినంగా ఉండే అంశాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుంటున్నాం.

**- యమనూరి శృతి, పదో తరగతి విద్యార్థి**

**వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం..**



ప్రత్యేక తరగతులు ఫిబ్రవరి, మార్చి మొదటి వారం వరకు కొనసాగుతాయి. సబ్జెక్ట్‌ల వారీగా పాఠాలు విద్యార్థులను ముందుకు తీసుకెళ్తున్నాం. సిలబస్ ప్రకారం బోధన చేపట్టి ఫలితాలు సాధించడానికి పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. వందశాతం ఫలితాలు,10 జీపీఏ సాధించా లనే లక్ష్యంతో పకడ్బందీ ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. పది విద్యార్థులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి.

**- టీ గంగాధర్, హెచ్‌ఎం(దస్తురాబాద్)**



విద్యార్థులతో సభ్యులు

## ఉన్నత శిఖరాలకు అధిరోహించాలి

ఉట్నూర్, డిసెంబర్ 9 : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని జిల్లా పీసా కోఆర్డినేటర్ వసంత్‌రావు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎయిమ్ ఫర్ సేవా అనాథ శరణాలయంలో హైదరాబాద్‌కు చెందిన వసుంధర జ్యూవెలర్స్ ఆధ్వర్యంలో కొలాం గిరిజనులకు ఉచితంగా అందించిన దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ పిల్లలు తమకు ఎవరూ లేరని బాధపడొద్దన్నారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితీ అధ్యక్షుడు ఠాకూర్ గోపాల్ సింగ్, దాల్‌మిల్ చైర్మన్ కుమ్ర విఠల్‌రావు, శ్రీనివాస్, వసుంధర జ్యూవెలర్స్ సంస్థ సభ్యులు లక్ష్మణ్, రాఘవ, మోతీరాం, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకోవాలి



ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెంబి, డిసెంబర్ 9 : తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని మహిళలు సద్వినియోగం చేసుకో వాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సల్లా స్వప్నిల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఉచిత బస్సు ప్రయాణాన్ని బస్సుకు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తులాల శంకర్, గుగ్గిల భూమేశ్, తోకల మహేందర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



పరిశుభ్రతపై వివరిస్తున్న కళాకారులు

## పరిసరాల శుభ్రత పాటించాలి

ఇంద్రవెల్లి, డిసెంబర్ 9 : చదువుతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాటల ద్వారా అవగాహన కల్పించారు. శనివారం ముత్నూర్ గిరిజన బాలికల కళాశాలలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు అవగాహన సదస్సు నిర్వహించారు. పరిసరాలతోపాటు విద్యార్థుల వ్యక్తిగత శుభ్రతపై పాటలు పాడారు. కళా కారులు చాహకటి రవి, రాథోడ్ శంకర్, గట్టు వంకట్‌రావ్, కుమ్ర నగేశ్, రమేశ్, గోవింద్ రావ్, రాజలింగు, మురళి, ఆశీష్, రాజు, నర్సమ్మ, దుర్గద తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వరి కోతలు

దస్తురాబాద్, డిసెంబర్ 9 : కడెం ప్రాజెక్ట్ ఆయకట్టు కింద, బోర్లు, బావుల ద్వారా రైతులు వానకాలం వరి పంటను సాగు చేశారు. పంటల చేతికి రావడంతో మండలంలో రైతులు తమ తమ పంటల్లో సాగు చేసిన వరి పంట కోతను ప్రారంభించారు. కాగా ప్రస్తుతం వరి కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు హార్వేస్టర్ యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. కాగా టైర్ల వరి కోత యంత్రానికి రూ. 1800 నుంచి రూ 2000 వరకు, చైన్ వరి కోత యంత్రానికి రూ. 3200 నుంచి రూ. 3500 వరకు ధర ఉంది. పంటలు సమృద్ధి పండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సేకరించిన ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా తమ తమ ఇంటి వద్దకు, కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు.



వరి పంట కోస్తున్న హార్వేస్టర్

### బాధిత కుటుంబానికి అండజేత

దస్తురాబాద్, డిసెంబర్ 9 : మండల కేంద్రానికి చెందిన సిందం నాగ చైతన్య అనే బాలుడు విద్యుత్ ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా ఖానాపూర్ పట్టణానికి చెందిన కృష్ణం రాజు ఐకేఆర్ ఫౌండేషన్ నుంచి రూ. 5 వేలు, మండల కేంద్రానికి చెందిన యువ సేన యూత్ సభ్యులు రూ.5 వేలు విరాళాన్ని అందజేశారు. చికిత్స కోసం రూ. 10 లక్షలు అవసరమని నమస్తే తెలంగాణ దిన పత్రిక, సామాజిక మాధ్యమంలో, వాట్సాప్ గ్రూప్‌ల్లో చూసి బాధిత కుటుంబానికి రూ.5 వేల అందించామని గ్రూప్ సభ్యులు తెలిపారు.

## రహదారి.. పచ్చని పందిరి

భైంసాటౌన్, డిసెంబర్, 9 : మండలంలోని వాటోలి గ్రామానికి వెళ్లే మార్గంలో హరిత హారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి చెట్లుగా మారి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఈ చెట్లు చల్లని నీడ స్వచ్ఛమైన గాలిని అందిస్తూ కనువిందు చేస్తున్నాయి.



వాటోలి వెళ్లే మార్గంలో ఏపుగా పెరిగిన హరితహారం చెట్లు

### గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీ తప్పనిసరి

పెంబి, డిసెంబర్ 9 : ప్రధాన మంత్రి ఉజ్వల్ గ్యాస్ సిలిండర్ కలిగిన ప్రతి వినియోగదారుడు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని అమృత ఇండేన్ గ్యాస్ నిర్వాహకుడు జాని కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈకేవైసీ కోసం వినియోగదారులు ఖానాపూర్‌లోని ఇండేన్ గ్యాస్ కార్యాలయం నందు ఈ నెల 31వ తేదీలోగా సంప్రదించాలని సూచించారు. ఈకేవైసీ చేసుకోకపోతే ఉజ్వల గ్యాస్ వినియోగదారులకు ప్రభుత్వం ద్వారా వచ్చే సబ్సిడీ రాదని సూచించారు.